క్లుప్తంగా

రాఘవేంద్రనగర్ కాలనీ అధ్యక్షుడిగా బాల్‌రాజ్


ఎమ్మెల్యే సబితారెడ్డితో బాల్‌రాజ్, కార్యవర్గ సభ్యులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ రాఘవేంద్రనగర్ కాలనీ ఫేజ్–1 వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను ఆదివారం కాలనీలో బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా సిరూర్ బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా రాంప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాల్‌రాజ్ మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పని చేస్తానని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, నాయకులు సిద్దాల అంజయ్యలు ఉన్నారు.

బోనాల ఉత్సవాలకు తరలిన కుమ్మరులు


కందుకూరు నుంచి బయలుదేరిన కుమ్మరులు

కందుకూరు: హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఉన్న కనకాల కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలకు కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరు, మహేశ్వరం మండలాల నుంచి కుమ్మరులు పెద్దఎత్తున తరలివెళ్లారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, ఆ సంఘం నాయకులు జాపాల సుధాకర్, బొడ్డుపల్లి రవి, మాడుగుల రాజు, కుమ్మరి నరేశ్ పాల్గొన్నారు.

వారాహిదేవికి ప్రత్యేక పూజలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలో 18 రకాల విశేష ద్రవ్యములతో అభిషేకం, మహిళలచే సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో విఠల్ శర్మ, సాయి కుమార్ శర్మ, రామశర్మ, శ్రీపతి శర్మ, అరుణ ,హేమ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ సమగ్ర అభివృద్ధికి కృషి

ఎంపీ ఈటల రాజేందర్

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలో వివిధ కాలనీల సంక్షేమ సంఘాలు, బీజేపి కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపి ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంటు దేశంలోనే అత్యధిక ఓటర్లు కలిగి ఉన్నారని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి అందరి ప్రజల మన్ననలు పొందుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, హస్తినాపురం డివిజన్ బీజేపి పార్టీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, కొత్త రవీందర్‌గౌడ్, కళ్లెం రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, అమరేందర్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, చిలుకూరి రాజేందర్, అరుణ్ సింగ్ పాల్గొన్నారు.

మట్టి కుండలతో పర్యావరణానికి మేలు

తుర్కయంజాల్: మట్టి కుండలోనే అమ్మవారికి బోనాలను సమర్పించాలని తెలంగాణ కుమ్మర సేవా సంఘం నాయకుడు ఎగిశెట్టి శశివర్ధన్ పిలుపునిచ్చారు. ఆదివారం తుర్కయంజాల్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి కట్టమైసమ్మ దేవాలయం వరకు బోనాలతో ర్యాలీని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను కాపాడాలని, మట్టితో చేసిన కుండలు పర్యావరణహితంగా ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ కుమార్, వెంకటేష్, అబ్బయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, విజయకృష్ణ, శ్రీను, బాలకృష్ణ పాల్గొన్నారు.

నిధులు లేక.. నిర్వహణ సాగక


గోతులమయంగా జల్‌పల్లి మున్సిపాలిటీ ప్రధాన రహదారి


శ్రీరాం కాలనీలో ప్రమాదకరంగా మారిన కల్వర్టు

- సమస్యల సుడిగుండంలో జల్‌పల్లి మున్సిపాలిటీ
- పట్టించుకోని అధికార యంత్రాంగం

పహాడీషరీఫ్: నిధుల లేమితో జల్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడింది. కనీసం మరమ్మతుల నిర్వహణకు కూడా డబ్బులు లేకపోవడంతో స్థానిక ప్రజలు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. పూర్తిస్థాయి మురికివాడగా ఉన్న ఈ మున్సిపాలిటీలో మొదటి నుంచే సమస్యలు విలయతాండవం చేస్తుంటాయి. ఐదేళ్ల కాలంలో అత్యవసరమైన రూట్లలో ఆశించిన మేర సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు, ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణ పనులు కొనసాగాయి. కొత్త ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వ చివరాఖరులో మంజూరు చేసిన రూ.45 కోట్ల నిధులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా ఎలాంటి ప్రత్యేక నిధులు మంజూరు సైతం కాకపోవడంతో అంతర్గత బస్తీలలో అప్పట్లో శంకుస్థాపన చేసిన పనులు కూడా అంతకే ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

శిథిలమైన రహదారులు

మున్సిపాలిటీలోని జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్, వాదే ముస్తఫా, వాదే సాల్హె హీన్, షాహీన్‌నగర్, క్యూబా కాలనీ, ఉస్మాన్‌నగర్, ఎర్రకుంట, తూర్ కాలనీ, తయ్యబా కాలనీ, అల్ జాబ్రీ కాలనీ, కొత్తపేట, మహమూద్ కాలనీ, బిస్మిల్లా కాలనీ, ఉస్మాన్‌నగర్ ఇలాంటి బస్తీలలో నిత్యం రోడ్లపైనే మురుగునీరు పారుతుంది. వెరసి చక్కగా ఉన్న రహదారులు కూడా మురుగు ప్రవాహంతో పాడైపోతున్న పరిస్థితి నెలకొంది. షాహీన్‌నగర్ హుడా పాఠశాల, ముస్లిం జనరల్ ఆస్పత్రి గల్లీల నుంచి మురుగునీరు శ్రీశైలం ప్రధాన రహదారిపై నెలల తరబడిగా పారుతుండడంతో జిల్లాలకు వెళ్లే వాహనదారులు సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక ఎర్రకుంట చౌరస్తాలో రోడ్డు శిథిలమై ఇప్పటి వరకు ఐదారుగురు మృత్యువాత పడ్డారు.

పేరుకే మున్సిపాలిటీ

ముఖ్యంగా జల్‌పల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలు స్థానికులను తీవ్ర వేదనకు గురి చేస్తున్నాయి. నెలల తరబడిగా అవుట్ లెట్ సమస్యతో ప్రధాన వీధులన్నీ మురుగుమయంగా మారాయి. ప్రభుత్వ పాఠశాల నుంచి మున్సిపాలిటీ వరకు గల రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారిపోవడంతో వాహనదారులకు వెన్నులో వణుకు పుడుతోంది. పైప్‌లైన్ కోసం తవ్వి మట్టితో పూడ్చడంతో రోడ్డు పూర్తిగా కృంగి పోయింది. ఈ గోతులమయమైన రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. కనీసం గోతులను తాత్కాలికంగా పూడ్చడంపై కూడా మున్సిపాలిటీ అధికారులు దృష్టి సారించకపోవడం పట్ల గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరు చేయాలి



మున్సిపాలిటీలో మారుమూల గ్రామాలలో కంటే అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఎక్కడ చూసినా పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు, కుప్పలు కుప్పలుగా చెత్తా చెదారాలు, శిథిలావస్థలో రహదారులతో ప్రజలు నిత్య నరకం అనుభవిస్తున్నారు. ముఖ్యంగా జల్‌పల్లి, శ్రీరాం కాలనీలో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ప్రభుత్వం స్పందించి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు వెచ్చించాలి. మున్సిపాలిటీ అధికారులు చిన్నపాటి మరమ్మతులనైనా వెంటనే చేపట్టాలి.

– యంజాల అర్జున్, జల్‌పల్లి

చర్యలు తీసుకోవాలి

బడంగ్‌పేట్: పూజలు చేసుకొంటున్న గణపతి మండపాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రఘు దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. కార్పొరేషన్‌లోని 28వ డివిజన్ సప్తగిరి కాలనీలో కూల్చిన గణేశ్ మండపంలోని దేవతామూర్తుల చిత్రపటాలను బుల్డోజర్లతో తొక్కించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీజేపీ, బీజేవైఎం, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ క్షేత్ర నాయకుల ఆధ్వర్యంలో కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బడంగ్‌పేటలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్త మున్సిపల్ కార్పొరేషన్ వద్ద కమిషనర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవతామూర్తుల చిత్రపటాలను బుల్డోజర్లతో తొక్కించిన కమిషనర్‌పై మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. గణపతి మండపాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూల్చిన మండపం వద్దే తిరిగి మండపాన్ని పునర్నిర్మించాలని కోరారు. అందుకు బడంగ్‌పేట బంద్‌కు పిలుపునిచ్చారు. నేడు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చామని ప్రజలు, దుకాణాదారులు, కాలనీవాసులు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శశిధర్, కళ్లెం రాజేందర్‌రెడ్డి, శర్మ, భజరంగ్‌దళ్ నాయకులు మహేశ్, బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు, సప్తగిరి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు

అవేర్ సంస్థ సేవలు అభినందనీయం

పాణ్యం మాజీ ఎమ్మెల్యే రామ్‌భూపాల్‌రెడ్డి

మహేశ్వరం: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఆస్పత్రిని ప్రారంభించడం అభినందనీయమని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామ్‌భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మెహబ్బత్ నగర్ గేటు సమీపం శ్రీశైలం జాతీయ రహదారి పక్కన అవేర్ సంస్థ ఆధ్వర్యంలో 35 పడకల మాధవన్‌జీ ఆస్పత్రిని ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, గిరిజన తండాల ప్రజలకు అవేర్ సంస్థ ఆస్పత్రిలో తక్కువ ఖర్చుతో ఆపరేషన్లు, పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అవేర్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆరోగ్య ధామ్ పేరుతో మాధవన్‌జీ ఆస్పత్రి, ఆయుర్వేదిక్, యూనాని, హోమియో, వెల్‌నెస్, యోగ శిక్షణ, ఆయుష్ కేంద్రం, ఆయుష్ పరిశోధన కేంద్రం, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, ల్యాబ్స్, ఫిజియో థెరపి కాలేజ్, సేంద్రియ ఉత్పత్తుల విక్రయ కేంద్రం, అంబులెన్స్ సేవలు త్వరలో భగవతిపురంలో దశలవారీగా ఏర్పాటు చేయబోతున్నారని వారు పేర్కొన్నారు. మాధవన్‌జీ ఆస్పత్రిలో సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు పూజలు నిర్వహించి ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అవేర్ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ, జేఎన్‌టీయూ మాజీ వైస్ ఛాన్స్‌లర్ కట్ట నర్సింహారెడ్డి, అవేర్ సంస్థ డైరెక్టర్ ఆఫ్ జనరల్ రాజవర్ధన్‌రెడ్డి, అవేర్ సంస్థ ప్రతినిధులు మన్సూర్ హైమద్, సీతారామం, రమకాంత్, వెంకట్‌రెడ్డి, పి.వరుణ్, తరుణ్, ఎండీ.ఇర్షాద్, వెంకన్న పలువురు పాల్గొన్నారు.


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామ్‌భూపాల్‌రెడ్డి

ట్రాఫిక్, శానిటేషన్ సమస్యలను పరిష్కరిస్తాం


జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అధికారులు

కాలనీల అసోసియేషన్ సమావేశంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజారు కూడలి, స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం తూర్పు కాలనీల అసోసియేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో వివిధ సమస్యలపై కమలానగర్‌కాలనీ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆటోనగర్ వద్ద ఇసుక లారీల అడ్డా తొలగింపునకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వనస్థలిపురం రైతుబజారు కూడలిలో తోపుడు బండ్లు, షెడ్ల దుకాణాదారులు రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేస్తుండడంతో అక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతూ వివిధ కాలనీలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాలనీలలో చెత్త వాహనాలు సరిగా రావడం లేదని, డ్రైనేజీ సమస్యలు, దోమల బెడద, సీసీ కెమెరాలు మంజూరు చేయాలని కోరారు. హైవేపై ఇసుక లారీ అడ్డా వద్ద హిజ్రాలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజారు వద్ద చిరువ్యాపారులు రోడ్డుపైకి రాకుండా మార్కింగ్ ఏర్పాటు చేయాలని, కొందరు వ్యాపారస్తులను పక్కనే ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం వద్దకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. కాలనీలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా చెత్తను రోడ్లపై వేయకుండా తమ ఇంటి వద్దకు వచ్చే వాహనాలలోనే వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డీసీ యాదయ్య, వనస్థలిపురం ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వనస్థలిపురం లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు, జేఏసీ సభ్యులు శ్రవణ్‌కుమార్, లక్ష్మణ్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నర్సింహారావు, శ్రీనివాస్, జగన్ మోహన్, శ్రీకాంత్, దివాకర్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంకు వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దుర్గయ్యగౌడ్

హస్తినాపురం: మహాత్మాజ్యోతిబా పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ (విదేశీ విద్య) కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న స్కాలర్‌షిప్ ఏడాదికి కేవలం మూడు వందల మందికి మాత్రమే ఇస్తున్నారని దీనిని మూడు వేల వరకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సమాఖ్య అధ్యక్షులు ఎస్. దుర్గయ్య గౌడ్ కోరారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మినిస్టర్ క్వార్టర్స్‌లో కలసి దుర్గయ్యగౌడ్ వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్ షిప్ ఐదువేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, బీసీల సంక్షేమం కోసం రూ. 20 వేల కోట్లతో సబ్‌ప్లాన్‌ను తీసుకురావాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచాలని బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరిగే విధంగా చూడాలని, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని దుర్గయ్యగౌడ్ కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అమీర్‌పేట్ గ్రామ పరిధిలోని ఆవుల చిన్న అంజయ్య ఫంక్షన్ హాల్‌లో ఒకే వేదికపై సందడి చేశారు. దాదాపు 16 సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు చెన్నారెడ్డి, దేవేందర్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, సంతోషికుమారి, పూర్వవిద్యార్థులు విక్రమ్, శ్రీకాంత్, వినయ్, శ్రీకాంత్, రాఘవేందర్‌చారి, మల్లేశ్, మధుసూదన్, రాజు తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు


కందుకూరులో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు


పహాడీషరీఫ్: జల్‌పల్లిలో..


బడంగ్‌పేట్: బాలాపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కందపెద్ద నర్సింహా ఆధ్వర్యంలో కందుకూరులో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట జెండా ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కొమ్మగళ్ల నర్సింహ, రాములు, ఆలేటి కృష్ణ, జంగయ్య, యాదయ్య, రాములు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంతయ్య, నర్సింహా, శ్రీనివాస్, రవి, జగదీశ్, పరంజ్యోతి, ప్రతాప్, అనిల్, కరణ్, రవి, నరేశ్, రత్నం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అలుపెరగని పోరాటం

పహాడీషరీఫ్: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తుందని జల్‌పల్లి ఇన్‌చార్జి యంజాల శివకుమార్ అన్నారు. జల్‌పల్లిలో ఆదివారం దండోరా పతాకాన్ని ఎగురవేయడంతో పాటు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు యంజాల దేవేందర్, నాయకులు దానయ్య, నర్సింహా, యాదగిరి, రామారావు, జామ సత్యం, వై.కుమార్, జ్ఞానేశ్వర్, బాల్‌రాజు, కుమార్, రవి పాల్గొన్నారు.

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుడు బొర్ర రవి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దండోరా ఉద్యమం 1994లో జూలై 7న ఈదుముడి గ్రామంలో మొదలై నేటికీ 30 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. మందకృష్ణ మాదిగ సారథ్యంలో ఎస్సీ వర్గీకరణ త్వరలో జరగనుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా మాదిగ దండోరా సోషల్ మీడియా ఇన్‌చార్జి ఆనంద్, మండల ఇన్‌చార్జి తోట్ల శ్రీనివాస్, శ్రీశైలం, సీనియర్ నాయకులు తిమ్మని గిరీశ్, నీరుడు శ్రీరాములు, ఇబ్రాం అంజయ్య, కిరణ్, అమ్రేశ్, నర్సింహా తదితరులు ఉన్నారు.

మహేశ్వరంలో..


మహేశ్వరం: కల్వకోల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మహేశ్వరం: మాదిగల్లో చైతన్యం, ఎమ్మార్పీఎస్ ఉద్యమం, మందకృష్ణ మాదిగ ద్వారానే వచ్చిందని ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి బక్కని రవి మాదిగ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కల్వకోల్, దుబ్బచర్ల, సుభాన్‌పూర్, మన్సాన్‌పల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ నిరంతరం ఉద్యమిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి బిల్లుకు చట్టబద్ధత తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్ర కృష్ణ, నడికూడ అర్జున్, ఎర్ర నవీన్, ఏర్పుల శంకరయ్య, గూడెపు రాములు, కృష్ణ, మహేందర్, రాజు, శంకరయ్య, అశోక్, కుమార్, నాగరాజు, బాల్‌రాజ్, అశోక్, రాజేశ్, ఆంజనేయులు, బన్నీ, సాయి పలువురు పాల్గొన్నారు.

'విద్యారంగంపై దృష్టి పెట్టండి'

కడ్తాల్: విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో వ్యవస్థ గాడి తప్పిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడిచినా విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని నేటికి విద్యాశాఖకు మంత్రిని నియమించలేదని విమర్శించారు. నూతనంగా నిర్మించిన కేజీబీవీ పాఠశాల భవనాన్ని ప్రారంభించకుండా ప్రభుత్వం చోద్యం చేస్తోందని ఆరోపించారు. రెండు మూడు రోజుల్లో పాఠశాల భవనాన్ని ప్రారంభించక పోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, నాయకులు వీరయ్య, లాయక్‌అలీ, శ్రీకాంత్ ఉన్నారు.

పత్తి వైపే రైతుల మొగ్గు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గత మూడు రోజులుగా తెలికపాటి వర్షం కురవడంతో రైతులు విత్తనాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో రైతులు వర్షాధార పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. గత కొన్నేళ్లుగా పత్తి సాగుకు అన్నదాతలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇతర పంటలతో పోల్చితే పత్తి సాగుకు పెట్టుబడి వ్యయం తక్కువ ఉండడంతో రైతులు పత్తి పంట సాగు చేయ్యడానికి ఆసక్తి కనబర్చుతున్నారు. పత్తి పంట ఎకరాకు 7 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని రైతులు అంటున్నారు.